# 105. అల్ ఫీల్ (ఏనుగు) సూరా

## పరిచయం

ఈ సూరా మక్కా కాలానికి చెందినది. ఇందులో 5 ఆయతులు ఉన్నాయి. సత్య తిరస్కారులకు పట్టిన దుర్గతిని ముఖ్యంగా ఈ సూరా ప్రస్తావించింది. మొదటి ఆయతులో 'ఫీల్' (ఏనుగు) గురించిన ప్రస్తావననే ఈ సూరాకు పేరుగా పెట్టడం జరిగింది. ప్రవక్త ముహమ్మద్ (సఅసం) పుట్టుకకు రెండు నెలలు ముందు జరిగిన ఒక చారిత్రక సంఘటనను ఈ సూరా ప్రస్తావించింది. యమన్‌కు చెందిన అబ్రహా రాజు మక్కాపై దండయాత్రకు వచ్చాడు. ఏనుగుల మహాసైన్యంతో దాడికి దిగాడు. కాని అల్లాహ్ ఆ దుర్మార్గపు దాడిని నిరోధించాడు. ఆ సైన్యంపైకి పక్షుల్ని గుంపులు గుంపులుగా పంపాడు. అవి వారిపై గట్టి కంకరరాళ్ళను విసిరాయి. వాటి ధాటికి ఆ సైన్యం నాశనమయ్యింది.

## سُورَةُ الْفِيلِ

بِسْمِ اللَّهِ الرَّحْمَٰنِ الرَّحِيمِ ○

أَلَمْ تَرَ كَيْفَ فَعَلَ رَبُّكَ بِأَصْحَابِ الْفِيلِ ①

## 105. అల్ ఫీల్ సూరా

అవతరణ :మక్కా ఆయతులు :5

అపార కరుణామయుడు, పరమ కృపాశీలుడైన అల్లాహ్ పేరుతో

**1** ఏమిటీ, నీ ప్రభువు ఏనుగుల వారిపట్ల వ్యవహరించిన తీరును నీవు చూడ లేదా?[1]

1. కాబా గృహాన్ని నేలమట్టం చేసే ఉద్దేశ్యంతో యమన్ నుండి వచ్చిన ఏనుగుల వారిపట్ల నీ ప్రభువు ఎలా వ్యవహరించాడో (ఓ ముహమ్మద్!) నీకు తెలియనిది కాదు. ఈ సంగతి నీ పట్టణవాసులకు కూడా తెలిసిందే. ఇలా ప్రశ్నించటంలోని ఉద్దేశం ఏమిటంటే, ఈ సంఘటన జరిగి ఎక్కువ కాలం కాలేదు. మక్కావాసులు దీనిని అంత సులువుగా మరచిపోలేరు. సుప్రసిద్ధ ఉల్లేఖనాల ప్రకారం ఏనుగుల వాళ్ళ సంఘటన మహాప్రవక్త (సఅసం) జన్మించిన సంవత్సరమే జరిగింది. క్లుప్తంగా ఈ సంఘటన ఇది :

అబిసీనియా చక్రవర్తి తరఫున అబ్రహా యమన్ ప్రాంతానికి గవర్నరుగా ఉండేవాడు. అతను 'సన్ఆ' అనే పట్టణంలో చాలా పెద్ద చర్చీని నిర్మించాడు. ఆ ప్రాంతంలోని జనులంతా మక్కాలోని కాబా గృహానికి బదులు ఆ చర్చీకి వచ్చి ప్రార్థనలు జరపాలన్నది అతని అభిలాష. అబ్రహా ప్రయత్నాలు మక్కావాసులకు, ఇతర అరేబియా తెగలకు మింగుడు పడలేదు. ఆ ఉక్రోషంతోనే అరేబియాకు చెందిన ఒక వ్యక్తి అబ్రహా కట్టించిన ప్రార్థనాలయంలో మలినం వేసి అపవిత్రం చేశాడు. ఈ సంగతి తెలుసుకున్న అబ్రహా ఆగ్రహోదగ్రుడయ్యాడు. కాబా గృహాన్ని నేలమట్టం చేసే సంకల్పంతో అతను ఓ పెద్ద సైన్యం తీసుకుని మక్కా వైపుకు దండెత్తి వచ్చాడు. అతని వెంట ఓ గజదళం కూడా ఉంది. తీరా అబ్రహా సైన్యం కాబా పరిసరాల్లోకి రాగానే దేవుడు ఆ సైన్యంపైకి ఓ పక్షుల గుంపును పంపాడు. అవి ఆ సైన్యంపై కంకర్రాళ్ళు పడేయటం మొదలెట్టాయి. ఆ కంకరరాళ్లు పడిన సైనికులు తీవ్రమైన దురదతో శరీరాలు గోక్కోసాగారు. ఆ గోకుడుకు కొద్దిసేపట్లోనే వారి శరీరాల మాంసం ఊడిపోసాగింది. ఆ విధంగా ఎంతోమంది సైనికులు నేలకొరిగారు. ఈ వింత పరిణామానికి అబ్రహా సైతం బెంబేలెత్తి తోకముడిచాడు. అతను సైతం 'సనా' పట్టణానికి చేరుకోగానే దురదను భరించలేక చనిపోయాడు. ఈ విధంగా అల్లాహ్ తన గృహాన్ని అపూర్వంగా కాపాడాడు. అంతకుముందు అబ్రహా మక్కా పొలిమేరల్లో విడిది చేసి మక్కా సర్దారు,

**2** ఏమిటీ, వాళ్ల కుట్రను (ఆయన) భగ్నం చేయలేదా?[2]

أَلَمْ يَجْعَلْ كَيْدَهُمْ فِي تَضْلِيلٍ ۝٢

**3** వాళ్లపై ఆయన గుంపులు గుంపులుగా పక్షులను పంపించాడు.[3]

وَأَرْسَلَ عَلَيْهِمْ طَيْرًا أَبَابِيلَ ۝٣

**4** అవి వారిపై మట్టితో తయారైన కంకర్రాళ్ళను కురిపించసాగాయి.[4]

تَرْمِيهِم بِحِجَارَةٍ مِّن سِجِّيلٍ ۝٤

**5** ఎట్టకేలకు, ఆయన వారిని తిని (తొక్కి వేసి)న తొక్కు మాదిరిగా చేసేశాడు.[5]

فَجَعَلَهُمْ كَعَصْفٍ مَّأْكُولٍ ۝٥

మహాప్రవక్త (స) తాతగారైన అబ్దుల్ ముత్తలిబ్ ఒంటెలను వశపరచుకున్నాడు. అబ్దుల్ ముత్తలిబ్ అబ్రహా దగ్గరకు వచ్చి, "నీ సైనికులు వశపరచుకున్న నా ఒంటెలను నాకు అప్పగించు. ఇక కాబా గృహమంటావా?! అది దైవగృహం. దాన్ని పడగొట్టే ఉద్దేశంతో నువ్వొచ్చావ్. ఆ వ్యవహారం నీకూ – దైవానికి మధ్య ఉంది. ఆయన స్వయంగా దాన్ని కాపాడుకుంటాడు" అని పలికారు. (ఐసరుత్తఫాసీర్).

2. అంటే, కాబా గృహాన్ని పడగొట్టడానికి వచ్చిన ఏనుగుల వాళ్ల కుయుక్తులను అల్లాహ్ వమ్ముచేశాడు.

3. **'అబాబీల్'** అంటే గుంపులు గుంపులుగా వచ్చినవి అని అర్థం.

4. **'సిజ్జీల్'** అంటే మట్టిని అగ్నిలో కాల్చి తయారుచేసిన కంకర్రాళ్ళని అర్థం. ఈ చిన్న చిన్న కంకర్రాళ్ళే ఆ సమయంలో శతఘ్నుల మాదిరిగా, మిజైళ్ళ మాదిరిగా పని చేశాయి.

5. అంటే వారి శరీరాలు పశువులు తిని తొక్కేసిన పొట్టు లేక చెత్త మాదిరిగా అయి పోయాయి.